వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 338 మంగళవారం | 30 జులై 2024 | పేజీలు : 08 | వెల రూ. 5

## నాడు జల కళ.. నేడు వెలవెల



2లో..



8లో

## లబ్ధిదారులు 14,700

రుణమాఫీ రూ.143.8 కోట్లు

హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య

## 'అలకనంద'కు నంది అవార్డ్

ప్రముఖుల ప్రశంసలు

4లో



## నాకు ప్రాణహాని ఉంది



### సీపీకి బాధితుడి ఫిర్యాదు

వారసత్వంగా వచ్చిన ఇంటి స్థలాన్ని బెదిరించి మా కుటుంబ సభ్యులకు రిజిస్ట్రేషన్ చేయించిన ఎస్సై చందర్ పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని బాధితుడు బొల్లెపల్లి వీరాస్వామి కోరారు. అట్టి రిజిస్ట్రేషన్ ను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వరంగల్ సీపీకి ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యులతో తనకు ప్రాణహాని ఉందని పేర్కొన్నారు.

– వరంగల్ వాయిస్, కాశిబుగ్గ




8లో..

## కేసీఆర్ పెద్ద కొడుకు సోమేశ్ కుమార్

జీఎస్టీ కుంభకోణంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి

వివరాలు 2లో..



# ఫిర్యాదులు బుట్టదాఖలు





- ప్రజా పాలనలో పట్టించుకోని అధికారులు
- ఏళ్లు గడుస్తున్నా మరమ్మతుకు నోచుకోని రెడ్డిపురం రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు, వాహన దారులు
- స్థానిక ప్రజా ప్రతినిధులకు పలుమార్లు వినతి
- ధర్నా చేసినా స్పందించని అధికారులు

ప్రజా పాలనలో ప్రభుత్వం ఇచ్చే హామీలకు స్థానికంగా అధికారులు చేస్తున్న పనులకు ఎక్కడా పొంతన లేకుండా పోతోంది. గ్రీవెన్స్‌లో వచ్చే వినతులకు త్వరిత గతిన పరిష్కార మార్గాలు చూపాలంటూ ముఖ్యమంత్రితో సహా ఇతర మంత్రులు, ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ఆశించిన ఫలితాలు కనిపించడం లేదు. హనుమకొండ నగరానికి కూతవేటు దూరంలో ఉన్న రెడ్డిపురం రోడ్లు ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తున్నాయి. యాదవ్ నగర్ సర్కిల్ నుంచి రెడ్డిపురం రింగ్ రోడ్డు వరకు రహదారి అధ్వానంగా మారింది. దీంతో వర్షాకాలంలో వాహనదారులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎత్తుపల్లాలుగా మారిన ఈ రోడ్డుపై వాహనాలు అదుపుతప్పి వాహనదారులు గాయాల బారిన పడుతున్నారు. స్థానికులు రహదారిని నిర్మించాలంటూ పలుమార్లు బల్దియాలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా, స్థానిక ప్రజా ప్రతినిధులకు విజ్ఞప్తి చేసినా, రహదారిపై ధర్నా చేసినా పట్టించుకునే వారే కరువయ్యారు. తారు లేకపోవడంతో ప్రమాదాలు జరిగి జీవితాలు తారుమారు అవుతున్నాయంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– వరంగల్ వాయిస్, హనుమకొండ

# ఫిర్యాదులు.. బుట్టదాఖలు



**ప్రజా పాలనలో పట్టించుకోని అధికారులు**

**ఏళ్లు గడుస్తున్నా మరమ్మతుకు నోచుకోని రెడ్డిపురం రోడ్డు**

**ఇబ్బందులు పడుతున్న స్థానికులు, వాహన దారులు**

**స్థానిక ప్రజా ప్రతినిధులకు పలుమార్లు వినతి**

**ధర్నా చేసినా స్పందించని అధికారులు**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మారుమూల పల్లెల్లోనే కాదు నగరంలోని రహదారులు సైతం నరకాన్ని తలపిస్తున్నాయి. హనుమకొండ నగరానికి కూతవేటు దూరంలో ఉన్న రెడ్డిపురం గ్రామ రోడ్లు ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తున్నాయి. యాదవ్ నగర్ సర్కిల్ నుంచి రెడ్డి పురం రింగ్ రోడ్డు వరకు రహదారి అధ్వానంగా మారింది. దీంతో వర్షకాలంలో వాహనదారులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎత్తుపల్లాలుగా మారిన ఈ రోడ్డుపై సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోంది. దీంతో ఏదైనా పని మీద బయటికి వచ్చిన వారు అదృష్టం బాగుంటే ఇంటికి.. లేదంటే కాళ్లు, చేతులు విరిగి దవాఖానకు అన్నట్లుగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం నరకం అనుభవిస్తున్న స్థానికులు రహదారిని నిర్మించాలంటూ పలుమార్లు బల్దియాలో నిర్వహించిన గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారే కరువయ్యారు. తారు లేకపోవడంతో ప్రమాదాలు జరిగి జీవితాలు తారుమారు అయ్యే పరిస్థితి నెలకొందంటున్నారు.

## తప్పని తిప్పలు..

యాదవ్ నగర్ సర్కిల్ నుంచి రెడ్డిపురం రింగ్ రోడ్డు వరకు వెళ్లే రహదారిపై వర్ష కాలంలో వాహనదారులు, స్థానికులు ప్రయాణించాలంటేనే భయంతో వనికి చస్తున్నారు. రహదారి పూర్తిగా పాడవడంతో వాహనాలు అదుపు తప్పి వాహన దారులు గాయలపాలవుతున్నారు. వాహనాలు స్కిడ్ కావడంతో పడిపోతున్న అనేక మంది గాయల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఏడాదిన్నరగా ఇబ్బందులు..

నగరంలోని యాదవనగర్ సర్కిల్ నుంచి రెడ్డి పురం రింగ్ రోడ్డు వరకు రూ.2 కోట్లతో బీటీ రోడ్డును వేసేందుకు ఏడాదిన్నర క్రితం అగ్రిమెంట్ కుదిరింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ సుమారు కిలోమీటర్ వరకు కంకర పోసి చదును చేయించి చేతులెత్తేశాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు బీటీ వేయడం మాత్రం మరిచిపోయారు. దీంతో స్థానిక వాహనదారులు ఈ రోడ్డుపై ప్రయాణించేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఇప్పటి వరకు పదుల సంఖ్యలో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోవడంతో గాయాలపాలు కాగా పలువురు మంచాలకే పరిమితం అయినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో ఒకరు ప్రమాదానికి గురై మృతి చెందిన సంఘటనను గుర్తు చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఎక్కడ కూడా విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయని కాలనీ వాసులు వాపోతున్నారు.

## గ్రీవెన్స్‌లో ఫిర్యాదు..



యాదవ్ నగర్ సర్కిల్ నుంచి రెడ్డి పురం ఔటర్ రింగ్ రోడ్డు వరకు మొత్తం 2.5 కిలోమీటర్ల రహదారి పనులను వెంటనే పూర్తి చేయాలని పలు మార్లు రెడ్డి పురం, విజయలక్ష్మి కాలనీ వాసులమంతా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ లో జరిగిన గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారే కరువయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రీవెన్స్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలంటూ ముఖ్యమంత్రితోపాటు కమిషనర్, కలెక్టర్ ఆదేశాలు జారీ చేస్తున్నా రెడ్డి పురం రహదారి సమస్య మాత్రం కొలిక్కి రావడంలేదు. స్థానిక సమస్యను పరిష్కరించాలంటూ కాలనీ వాసులంతా రోడ్డెక్కి ధర్నా చేసినా ఫలితం కనిపించలేదు. గ్రీవెన్స్ ఫిర్యాదులతో కాలనీకి వచ్చి రహదారిని పరిశీలించిన మేయర్, బల్దియా అధికారులు ఆతర్వాత మిన్నకుండడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ఎమ్మెల్యేకు వినతి..



గ్రీవెన్స్ లో సమస్యకు పరిష్కారం లభించకపోవడంతో స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును కాలనీ వాసులు కలిసి వాహన దారులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాదవ్ నగర్ సర్కిల్ నుంచి రెడ్డి పురం రింగ్ రోడ్డు వరకు జరిగే రోడ్డు పనులను ఆపేయడంతో దుమ్ము, ధూళి చేరుతుందని, అలాగే వర్ష కాలంలో రోడ్లు గుంతలుగా ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయంటున్నారు. వెంటనే రహదారి పనులను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యేతోపాటు నగర మేయర్, మున్సిపల్ కమిషనర్, ఇతర ఉన్నతాధికారులు కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.









## నాడు జల కళ.. నేడు వెలవెల

డోర్నకల్ నియోజకవర్గ వరప్రధాయని ఆకేరు వాగు గత సంవత్సరం జూలై మాసంలో నిండు కుండను తలపిస్తుండగా ఈ ఏడాది వరుణుడి కటాక్షం లేకపోవడంతో వెలవెల బోతోంది. ఎగువనుంచి వరదనీరు రాకపోవడంతో ఆకేరు వాగు నీళ్ళు లేక ఎడారిని తలపిస్తోంది. నీరు రావడం ఆలస్యమైతే ఖరీప్ పై ఆశలు గల్లంతు అవుతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
-వరంగల్ వాయిస్, మరిపెడ

## సామాన్య స్థితి నుంచి..
# అసమాన్య స్థాయికి ఎదిగిన బాబురావు

**ఆయన జీవితం అందరికీ ఆదర్శం**

**కొనియాడిన వక్తలు**



**వరంగల్ వాయిస్, జనగామ :** సామాన్య స్థితి నుంచి అసమాన్య స్థాయికి ఎదిగిన లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ ఘట్టమనేని బాబురావు జీవితం అందరికీ ఆదర్శమని 320ఎఫ్ జిల్లా గవర్నర్ లయన్ కుందూరు వెంకట్ రెడ్డి కొనియాడారు. జూలై 30న బాబురావు 68 వ జన్మదినం సందర్భంగా జనగామ జిల్లాలోని ఎనిమిది రీజియన్ల పరిధిలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జనగామలో జరిగిన కార్యక్రమంలో వెంకట్ రెడ్డి మాట్లాడుతూ సామాన్యమైన కార్మికుని స్థాయి నుంచి స్వయంకృషితో అంచలంచెలుగా ఎదిగి, ఆర్థికంగా సమాజంలోని అవసరార్థులకు సహాయం చేసే దాతృత్వ గుణాన్ని అలవర్చుకున్న బాబురావు జీవితం మనందరికీ ఆదర్శమన్నారు. జనగామ జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలో నిర్వహించిన కార్యక్రమంలో రీజియన్ 7, 8 చైర్మన్లు కె.భాస్కర్ రెడ్డి, సీహెచ్ రవీందర్ రెడ్డిల మార్గదర్శనంలో జోన్ చైర్మన్లు పజూరి జయహరి, శ్రీ భాష్యం రఘు, ఆర్.ప్రవీణ్ కుమార్, వేణుగోపాల్ ల సారథ్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న పూర్వ జిల్లా గవర్నర్ కన్నా పరశురాములు మాట్లాడుతూ డాక్టర్ బాబురావు ప్రతి సంవత్సరం సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఆయన జన్మస్థలంలోని అవసరార్తులను చేరదీసి వారికి సహకరిస్తున్న మహనీయుడని అన్నారు. ఆయనలో ఉన్న క్రమశిక్షణ, ప్రేమతత్వం, సహకార, సౌభ్రాతృత్వ గుణం చదువుల పట్టాలతో పని లేకుండా ఆయనకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చి పెట్టాయి కాబట్టే ఆయన ఇంటర్నేషనల్ బోర్డు సభ్యుడిగా పోటీ లేకుండా ఎన్నికయ్యారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్యాబినెట్ కార్యదర్శి సయ్యద్ హబీబ్, జిల్లా నాయకులు, స్థానిక నాయకులు పెద్ది వెంకట నారాయణ గౌడ్, శ్రీరామ్ శ్రీనివాసు, కృష్ణ జీవన్ బజాజ్, గంగిశెట్టి ప్రమోద్ కుమార్, బి.నరసింహ రెడ్డి, ఎడమ సంజీవ రెడ్డి, ఎ.నర్సిరెడ్డి, కన్నా శ్రీనివాస్, అల్లాడి ప్రభాకర్ రావు, నాగ బండి రవీందర్, శ్యాంసుందర్, డాక్టర్ డి.శివ శంకర్ రావు, వై.శ్రీనివాస్ రెడ్డి, ఈ.భూయాదగిరి, బానోతు రవి నాయక్, సిద్ధులు, శివరామకృష్ణ, గాదే నర్సింలు, వేణుగోపాల్ రెడ్డి, పీ.సురేష్, బండ భిక్షపతి పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** మండలంలోని రామాంజాపురం గ్రామానికి చెందిన నడిగోటి నర్సమ్మ అనారోగ్యంతో సోమవారం ఉదయం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా సీనియర్ నాయకుడు బాదం ప్రవీణ్ వెంటనే గ్రామానికి చేరుకొని నర్సమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. నర్సమ్మ కుటుంబానికి అండగా ఉంటానని ప్రవీణ్ హామీ ఇచ్చారు.

## ఆటో డ్రైవర్లకు ప్రత్యేక బడ్జెట్ పెట్టాలి



**వరంగల్ వాయిస్, ములుగు :** జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ల జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అత్యవసర సమావేశం జరిగింది. సోమవారం ఈ సమావేశాన్ని ఆటో నగర్ లో నిర్వహించారు. ఈ సమావేశానికి ఆటో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వేల్పుల నరేష్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ హాజరై మాట్లాడారు. ప్రస్తుతం తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో రేపు అసెంబ్లీకి వినతి పత్రం అనే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్లో ఆటో డ్రైవర్లకు బడ్జెట్ కేటాయించకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. తక్షణమే ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి కోట్ల బడ్జెట్ ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, ఆటో డ్రైవర్లకు ఇన్సూరెన్స్ బీమా, హెల్త్ కార్డుల సదుపాయాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మా న్యాయమైన డిమాండ్లను నెరవేర్చినట్లయితే రాబోవు రోజుల్లో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామన్నారు. సమావేశం అనంతరం ఆటో బతుకులు సీరియల్ 6వ ఎపిసోడ్ వేల్పుల నరేష్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా అడ్డాల డ్రైవర్స్, హైమాద్ హరీష్, ఓంకార్ చారీ, కిరణ్, తిరుపతి, కుమార్, సాయి, సందీప్, నరేష్, వినయ్, కర్ణకర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి



**వరంగల్ వాయిస్, శాయంపేట :** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో 2001 నుంచి 2014 వరకు అనేక పోరాటాలు చేసి కేసుల పాలై ఆర్థికంగా ఆరోగ్య పరంగా దెబ్బతిని నష్టపోయిన తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ప్రతినెల రూ.25 వేలు గౌరవ వేతనం, 250 చదరపు గజాల ఇంటి స్థలం కేటాయించాలని అసెంబ్లీలో చర్చ జరిపి బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ మంగళవారం తహసీల్దార్ సుభాషినికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల సంఘం మండల అధ్యక్షుడు పొడి శెట్టి గణేష్, తెలంగాణ ఉద్యమకారులు కొమ్ముల శివ, గిద్దమారి సురేష్, దుంపల మహేందర్ రెడ్డి, ఎండీ రఫీ, రాజ్ మహమ్మద్, ఎండీ మాదర్, నమిత, బాజీ అశోక్, కానుగుల నాగరాజు, వనం దేవరాజ్ పాల్గొన్నారు.

# ప్రజా కలల పండుగను విజయవంతం చేయాలి

### ప్రజా నాట్య మండలి
### రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆగస్ట్ 7న హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే ప్రజా కలల పండుగను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో తెలంగాణ ప్రజానాట్య మండలి హనుమకొండ, వరంగల్ జిల్లాల నిర్మాణ మహాసభలు దామెర కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలకు ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ మాట్లాడుతూ కళాకారులకు గుర్తింపు కార్డులు ఇచ్చి తగిన ప్రాధాన్యత కల్పించాలని ఆరోగ్యపరమైన ఇన్సూరెన్స్, హెల్త్ కార్డులు ఇవ్వాలని, నూతన కళాకారులకు పెన్షన్ ఇవ్వాలని, వృద్ధ కళాకారులకు నెలకు రూ. 6000 పెన్షన్ ఇవ్వాలని, కళాకారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. అలాగే రాష్ట్రంలో రవీంద్ర భారతిలో మాదిరిగానే తెలంగాణ అన్ని జిల్లాలలో మినీ రవీంద్ర భారతిలు నిర్మించాలని వరంగల్ పోచమ్మ మైదానంలో ఆగిన మినీ కల్చరల్ భవనాన్ని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వరంగల్లో నాటకాలు వేసేందుకు ప్రస్తుతం ఒక పోతన విజ్ఞాన పీఠం మాత్రమే ఉందన్నారు. వెంటనే వరంగల్ లో మినీ కల్చరల్ భవనాన్ని పూర్తి చేయాలని అన్నారు. వచ్చేనెల 7న జరగబోయే ప్రజా కళల పండుగ అన్ని జిల్లాల నుంచి వేలాది మంది కళాకారులు వచ్చి తమ ఆటపాటలతో ప్రదర్శనలు ఇస్తారన్నారు. ప్రజా కళల పండుగ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలలో తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి కేతరాజు ఉప్పలయ్య వరంగల్ జిల్లా నిర్మాణ బాధ్యులు, గౌరవ అధ్యక్షుడు గన్నారపు రమేష్, ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు కార్యదర్శి నద్దునూరి అశోక్ స్టాలిన్ హాజరయ్యారు. అనంతరం రెండు జిల్లాల కమిటీని అనుకున్నారు.

**హనుమకొండ జిల్లా కమిటీ..**
జిల్లా అధ్యక్షుడిగా గడ్డం రాజనర్సు, ఉపాధ్యక్షులుగా రెంటాల శ్యామ్, భూషణం, ప్రధాన కార్యదర్శిగా కొట్టపాక రవి, సహాయ కార్యదర్శులుగా పల్లె రామ, కొత్తపల్లి లింగం, కోశాధికారిగా మునిగాల సుగుణలతో పాటు 15మంది కమిటీతో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

**వరంగల్ జిల్లా కమిటీ..**
జిల్లా గౌరవ అధ్యక్షుడిగా గన్నారపు రమేష్, అధ్యక్షుడు రాంపల్లి నరేష్, ఉపాధ్యక్షులు బత్తుల సుప్రియ, ఎండీ మున్ని, ప్రధాన కార్యదర్శిగా దామెర కృష్ణ, సహాయ కార్యదర్శులుగా చిట్యాల సువర్ణ, ఆరెల్లి రవి, కోశాధికారిగా జన్ను హరిబాబులతో పాటు 25 మంది కమిటీతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## బైక్ రైడర్ గడ్డం నాగవంశీకి సన్మానం



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని రాయపర్తి గ్రామానికి చెందిన గడ్డం నాగవంశీ సొంత గ్రామానికి వచ్చిన సందర్భంగా ఘన సన్మానం చేశారు. పరకాలలోని ప్రముఖ వైద్యుడు మార్న రజనీకాంత్ గౌడ్ సన్మానించి అభినందించారు. లాడాక్, స్పీటి, వ్యాలీలో తన యమహా ఎంటీ 15 పై 30 రోజుల యాత్రలో ఉమ్లింగ్ లా ప్రపంచంలోనే అత్యున్నతమైన మోటారబుల్ పాస్, అమృతసర్ స్వర్ణాలయ సందర్శన, త్సో మొరిరి సరస్సు, హన్లే ఖగోళ పరిశోధన కేంద్రం, 6700 కిలోమీటర్లకు పైగా బైక్ రైడ్ చేశారు. ఈ అద్భుత యాత్రలో కిలోమీటర్లను కాకుండా భారతదేశంలోని విభిన్న సంస్కృతి ఆధ్యాత్మికత ప్రకృతి అందాలను అనుభవించిన యాత్రలో ఆశ్చర్యకరంగా మరచిపోలేని జ్ఞాపకాలతో తన సొంత గ్రామానికి వచ్చిన సందర్భంగా తన మిత్రులు అందరు కలిసి ఘనంగా సన్మానించారు.



## అపరిచిత వ్యక్తుల సమాచారం ఇవ్వాలి

### గొత్తికోయలకు ఎస్ఐ సతీష్ సూచన



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో వెంకటాపూర్ పోలీసులు అప్రమత్తం అయ్యారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా వెంకటాపూర్ ఎస్ఐ జక్కుల సతీష్ ఆధ్వర్యంలో పోలీసులు గత రెండు రోజులుగా మండలంలోని అటవీ ప్రాంతంలో ముమ్మరంగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం ఉదయం మండలంలోని నారాయణపురం గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో గల బండ్లపహాడ్ గొత్తికోయ గూడెంను సందర్శించి ప్రతి ఇంట్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఇంట్లో ఎవరెవరూ ఉంటారు. ఎవరైనా కొత్త వారు ఉన్నారా అనే కోణంలో పూర్తి వివరాలు సేకరించారు. గూడెంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అదేవిధంగా ఎస్ఐ జక్కుల సతీష్ ఆధ్వర్యంలో పోలీసులు మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం సాయంత్రం రహదారుల వెంట ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ సతీష్ డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ బుక్, తదితర వాహన పత్రాలను పరిశీలించడంతో పాటు ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తున్నారు అనే కోణంలో వివరాలు సేకరించారు. అంతేకాకుండా ఎలాంటి వాహన పత్రాలు లేని వారికి జరిమానా విధించడంతో పాటు అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించి వదిలిపెట్టారు.

# ఆగస్ట్ 4న వరంగల్‌లో రాష్ట్ర సదస్సు

### టీఏకేఎస్ రాష్ట్ర నాయకుడు దాసరి రమేష్



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** ఆగస్ట్ 4న వరంగల్ లో కార్మిక వర్గ హక్కులకై, కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ అసంఘటిత కార్మిక సంఘాల సమాఖ్య(టీఏకేఎస్) రాష్ట్ర నాయకుడు దాసరి రమేష్ తెలిపారు. ఈ సదస్సును కార్మికులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా ఆటో కార్మికులకు రమేష్ పిలుపునిచ్చారు. సమాన పనికి సమాన వేతనం, మోడీ ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని, ప్రభుత్వ, ప్రైవేట్ హాస్పిటల్ రంగాలలో పని చేస్తున్న ప్రతి కార్మికునికి కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి ఇప్పుడు ఉన్నకార్మికులందరిని పర్మినెంట్ చేయాలన్నారు. భూపాలపల్లి ఆటో స్టాండ్ యూనియన్ కార్యదర్శి ఎస్ రాజకుమార్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేసి వాళ్లను ఆదుకోవాలని కోరారు. ఇంకా మన దేశంలో 44 కోట్ల అసంఘటిత కార్మికులుగా, తెలంగాణలో ఉన్న కోటి 50 లక్షల మంది కార్మికుల కోసం అసంఘటిత రంగాన్ని సమగ్రమైన చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఆగస్ట్ 4న జరిగే సదస్సును విజయవంతం చేయాలనీ కోరుతూ మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తెలంగాణ అసంఘటిత కార్మిక సంఘాల సమాఖ్య కరపత్రాన్ని ఆవిష్కరణ చేశారు. అసంఘటిత కార్మిక సంఘం భూపాలపల్లి జిల్లా కార్యదర్శి అయితే బాపు మాట్లాడుతూ నిరుపేదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్, సానిటేషన్, పేషంట్ కేర్ ఉద్యోగులను తక్షణమే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్ యూనియన్ కార్మికులు ఎం.మల్లేష్, శ్రావణ్, రాజకుమార్, కృష్ణ, రవితేజ, శ్రీకాంత్, స్వామి, చాంద్ పాషా, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయండి

## ఒక మీటరుతో వంద ఇండ్లకు విద్యుత్ సరఫరా



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** పట్టణంలోని అదో శివారు కాలనీ, విద్యుత్ శాఖ అధికారులు ఆ కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయకపోవడంతో ఒక్కగానొక్క విద్యుత్తు మీటరుతోనే కరెంటు కష్టాలు తీర్చుకుంటున్నారు ఆకాలనీ వాసులు. గృహజ్యోతి అమలు కావడంతో తమ కాలనీలోని ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇస్తారని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఆ కాలనీలో రహదారులు, మంచి నీటి సౌకర్యం కల్పించాలని కాలనీ వాసులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారులో పదేళ్ల క్రితం ప్రభుత్వ స్థలంలో కొంత మంది నిరుపేదలు ఇల్లు నిర్మించుకొని నివసిస్తున్నారు. ఈ కాలనీకి మందా కొమరమ్మ నగర్ కాలనీగా పేరు పెట్టుకున్నారు. ఈ కాలనీలో విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో సమీప ప్రాంతంలో పరిశ్రమ కోసం ఒకరు తీసుకున్న మీటరు నుంచి ఆ కాలనీ కొందరు తమ తమ ఇండ్లకు వైర్లు లాక్కొని విద్యుత్తు అవసరాలను తీర్చుకుంటున్నారు. ఆ కాలనీలో ఇండ్లు నిర్మించుకున్న 136 మందికి గత ప్రభుత్వం పట్టాలిచ్చింది. వారిలో 115 మందికి పురపాలక సంఘం ఇంటి నంబర్లను కేటాయించింది. అయినా అధికారులు మాత్రం ఈ కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయలేదు. వీధి దీపాలు బిగించలేదు. దీంతో వారంతా కర్రలు, చెట్లకొమ్మలే ఊతంగా సర్వీసు తీగల నుంచి వైర్లు ఏర్పాటు చేసుకుని విద్యుద్దీపాలు బిగించుకుంటున్నారు. ఉన్న ఒక్కగానొక్క మీటరుకు ప్రతినెలా రూ.50 వేల నుంచి రూ.65 వేల వరకు బిల్లు వస్తుండగా.. తలా కొంత చెల్లిస్తున్నారు. అయితే, ప్రభుత్వం పేదలకు విద్యుత్ రాయితీ ఇస్తుంటే.. తామెందుకు బిల్లులు చెల్లించాలంటూ 4 నెలలుగా వాటిని చెల్లించడంలేదు. ఆ బిల్లు రూ.2.65 లక్షలకు పేరుకుపోయింది. పురపాలక సంఘం ఖర్చులను భరిస్తే కాలనీలో విద్యుత్తు స్తంభాలను ఏర్పాటు చేసి, మీటర్లు బిగిస్తామని ఎన్‌పీడీసీఎల్ మహబూబాబాద్ డీఈ విజయ్ తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ కాలనీలో విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేసి, మౌలిక సౌకర్యాలు కల్పించాలని కాలనీ వాసులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఆశాల అక్రమ అరెస్టులు సరికాదు

## బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్ భాస్కర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆశా వర్కర్లు తమ న్యాయమైన హక్కుల కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలపడానికి సిద్ధమవుతుంటే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను ఉపయోగించి అక్రమ అరెస్టులు చేయడం సరికాదని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. మంగళవారం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ మహిళలు అని కూడా చూడకుండా అర్థరాత్రి ఇండ్లలోకి వెళ్లి బలవంతంగా పోలీస్ స్టేషన్లకు తీసుకెళ్లడం ఏంటని ప్రశ్నించారు. సమస్యలపై ఎవరూ రోడ్డుమీదకు రాకుండానే మా ప్రభుత్వం వస్తే ప్రజా పాలన ప్రజల వద్దకే వస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్ ప్రభుత్వం అందుకు విరుద్ధంగా ఆచరణలో వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఆశా వర్కర్లతో పారితోషికం లేనటువంటి పనులను చేయిస్తూ ప్రభుత్వం శ్రమ దోపిడీ చేస్తుందని, పని ఒత్తిడి పెరిగి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే పరిష్కారం చేసేది పోయి ప్రశ్నించే వారిని అరెస్టులు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పద్ధతి మార్చుకోకుంటే ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు.

# కలెక్టర్‌ను కలిసిన కమాండెంట్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఇటీవల మామునూర్ నాలుగవ బెటాలియన్ నూతన కమాండెంట్ గా బాధ్యతలు చేపట్టిన బి.రామ్ ప్రకాష్ మంగళవారం వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారదను మర్యాదపూర్వకంగా కలుసుకొని మొక్కను అందజేశారు.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

## కమిషనర్ కార్యాలయం ఎదుట మహాధర్నా




**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న వివిధ రకాల సిబ్బందిని ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ నరసింహ ఆధ్వర్యంలో మంగళవారం కమిషనర్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ధర్నా చేసి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 17514 ఎన్ హెచ్ ఎంలో ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని, శ్రమ దోపిడికి గురవుతూ పేద ప్రజల ఆరోగ్యమే పరమావధిగా భావించి పని చేస్తుంటే వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా నియమించకుండా కాలయాపన చేయటాన్ని విమర్శించారు. గత ఏడు నెలల పీఆర్సీ బకాయిలు, మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని, హెల్త్ కార్డ్స్, ఇన్సూరెన్స్, ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8నెలలు గడుస్తున్నా ప్రభుత్వ, ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు 4వ తరగతి సిబ్బందికి రూ. 26వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 4000 మందికి 510 జీవోలో అన్యాయం జరిగిందని, వారికి న్యాయం చేయాలని కోరారు. వెంటనే కనీస వేతనాలు పెంచాలని ధర్నా ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ నూకల అంజి మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే హెచ్ఆర్డీఏ పాలసీ ఇంప్లిమెంటేషన్ చేయాలని ప్రభుత్వాన్ని విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో పద్మ, జ్యోతి, శ్రావణ్, అనిత, తిరుమలేష్, సంతోష్, కరుణ, దేవనబోయిన బాపు యాదవ్, రాజ్ కుమార్, మల్లేష్, మునీర్, అనిల్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# అలకనంద రాథోడ్‌కు గౌతమి నంది అవార్డు ప్రదానం




**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని ఆన్ సాన్ పల్లి గ్రామానికి చెందిన వర్ధమాన నృత్య కళాకారిని బేబీ అలకనంద రాథోడ్ భూపాలపల్లి పట్టణంలో బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్ లో 6వ తరగతి చదువుతూ భరత నాట్యం పట్ల తనకున్న ఆసక్తిని చూపుతూ గత రెండు సంవత్సరాల నుంచి ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలల్లో తన నృత్యాన్ని ప్రదర్శిస్తూ ఇప్పటికే జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి,పలు రకాల అవార్డులను సొంతం చేసుకుంటూ 2024 ఉగాది పురస్కారం అందుకుని ప్రముఖుల ప్రశంసలు పొందారు. ఇటీవల హైదరాబాద్ లో జరిగిన జాతీయ స్థాయి సాంస్కృతిక నృత్యకళ ప్రదర్శన పోటీలలో తన నృత్య ప్రదర్శనతో అందరిని ఆకట్టుకుని 2024 గౌతమి అవార్డుతో పాటు జాతీయ స్థాయి ఐకాన్ అవార్డుకి ఎంపికయ్యారు. ఆదివారం హైదరాబాద్ చిక్కడపల్లి త్యాగరాయ గాన సభ ఆడిటోరియంలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ప్రముఖ తెలంగాణ సంఖ్యా శాస్త్రవేత్త పద్మశ్రీ అవార్డు గ్రహిత శ్రీ దైవజ్ఞ శర్మ చేతుల మీదుగా 2024 గౌతమి నంది అవార్డు, జాతీయ స్థాయి ఐకాన్ అవార్డుని అందుకున్నారు. కార్యక్రమం అనంతరం దైవజ్ఞ శర్మ మాట్లాడుతూ భరత నాట్యం పట్ల బేబీ అలకనందకు ఉన్న నైపుణ్యాన్ని చూసి అభినందించారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, విశ్వవిఖ్యాత ఆర్ట్స్ అండ్ కల్చరల్ అకాడమీ చైర్మన్ ఎస్ వీఆర్, గోసంరక్షణ సమితి చైర్మన్ విద్యాసాగర్, విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రేపు ముల్కనూరు మహిళా పాల డెయిరీ వార్షికోత్సవం





**వరంగల్ వాయిస్ భీమదేవరపల్లి :** మండలంలోని ముల్కనూరు గ్రామానికి చెందిన పాల డెయిరీ ఆసియా ఖండంలో మొదటి స్థానంలో స్వకృషి ముల్కనూరు మహిళా డెయిరీ 22వ వార్షికోత్సవ మహాసభ ఈ నెల 31న ప్రధాన కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ ప్రకటన ద్వారా తెలిపారు. ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాలో ముల్కనూరు డెయిరీ సంబంధించిన 203 గ్రామాల్లో 23,214 మంది సభ్యులతో ప్రతి రోజు 2కోట్ల లీటర్లకు పైగా పాలను సేకరిస్తున్నారు. సంవత్సరానికి రూ.162 కోట్ల రూపాయల వ్యాపారం నిర్వహిస్తూ ముల్కనూరు సొసైటీ ఆదర్శంగా నిలుస్తోంది. సభకు సభ్యులు అందరు హాజరు కావాలని జీఎం మార్పాటి భాస్కర్ రెడ్డి కోరారు.

# సురభి నాటకాలను ఆదరించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సురభి సంస్థ 140 సంవత్సరాల నుంచి నాటక రంగాన్ని వారి జీవనోపాధిగా చేసుకొని వివిధ ప్రదేశాలలో ప్రదర్శనలు నిర్వహిస్తూ గుర్తింపు తెచ్చుకున్నారని, ఆ రోజులలో వీరిని, వీరి కళకు ప్రత్యేక గుర్తింపు ఉండేదని రాను రాను మారిపోతున్న కాలానుగుణంగా ఈ కళకు ఆదరణ తగ్గిపోతుందని వారిని ఆదరించి గౌరవించాల్సిన బాధ్యత ప్రజలపై ఉంది తెలంగాణ డ్రమెటిక్ అసోసియేషన్ ప్రచార కార్యదర్శి ప్రముఖ సామాజిక వేత్త నిమ్మల శ్రీనివాస్ అన్నారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్ లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో ఈ నెల 31 వరకు ప్రతిరోజు నాటక ప్రదర్శన జరుగుతుందని దానిలో భాగంగా సోమవారం "పాతాళ భైరవి"మంగళవారం"రావణబ్రహ్మ", బుధవారం" బ్రహ్మంగారి చరిత్ర " నాటక ప్రదర్శనలతో ఈ కార్యక్రమాలు ముగుస్తాయని కళాభిమానులు, కళాపోషకులు ప్రజలు ఈ ప్రదర్శనలకు విచ్చేసి, తిలకించి అంతరించిపోతున్న సురభి కళాకారులను ప్రోత్సహించి తోచిన విధంగా ఆర్థిక సహాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ ప్రదర్శనలు తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో భానోదయ నాట్యమండలి, సురభి రేకందర్ నాగబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

# విద్యార్థి సంఘాలపై ఆరోపణలు తగదు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో ఉన్న కొన్ని కార్పొరేట్,ప్రైవేట్ జూనియర్ కళాశాలలయాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఒకే కళాశాల అనుమతి పొంది అనేక బ్రాంచ్లు నడుపుతున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లక్షల రూపాయల ఫీజులు రూపంలో దోచుకుంటూ విద్యార్థి విద్యార్థుల తల్లిదండ్రులకు నిలువు దోపిడీ చేస్తున్నారు. ఈ విషయంపై ప్రశ్నించిని విద్యార్థి సంఘాలపై ఎదురు దాడికి దిగుతూ, విద్యార్థి సంఘాలపై చందాల పేరిట అసత్య ప్రచారాలు చేస్తూ విద్యార్థి సంఘాల ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నం చేయడం తగదని ఏఐఎస్‌బీ నాయకులు హకీమ్ నవీద్ ఒక ప్రకటనలోఅన్నారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న జూనియర్ కళాశాలలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నడుస్తుంటే బహిరంగ చర్చకు రావాలని తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాల అసోసియేషన్ నాయకులకు సవాలు విసిరారు. అంతేకాకుండా విద్యార్థి సంఘాలపై అసత్య ఆరోపణలు చేస్తే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. తక్షణమే విద్యార్థి సంఘాల పై చేసిన ఆరోపణలను వెనుక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 40వ డివిజన్‌లోని ఖాళీ స్థలాలు కలిగి ఉన్న యజమానులు తమ తమ ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి కోరారు. ఇటీవల కురిసిన వర్షం వలన డివిజన్ లోని ముకుంద కాలనీలో ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండటం వలన దోమలు వృద్ధి చెంది తమకు హాని చేకూరుతుందని ఆ కాలనీ ప్రజల ఫిర్యాదు మేరకు మహానగర పాలక సంస్థ మలేరియా విభాగం ఆధ్వర్యంలో నీరు నిల్వ ఉన్నచోట్ల కార్పొరేటర్ మరుపల్ల రవి ఆయిల్ బాల్స్ వేశారు. ఇంటిలో గాని, పరిసర ప్రాంతాలలో నీరు నిలవకుండా వెంటనే పారపోయాలని ఆ ప్రాంత ప్రజలను కోరారు. నేటి రోజులలో వివిధ అంటూ వ్యాధులు ప్రబలి ప్రజలు అనారోగ్యంతో ఆస్పత్రి పాలవుతున్నారని ఆయన తెలిపారు. త్వరలోనే స్లమ్ ఏరియాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని కార్పొరేటర్ మరుపల్ల రవి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు ఉల్లి కవిత, ముత్తినేని రజిత, బానోతు విజయ్, బాలాజీ, జవాన్ ప్రశాంత్, మలేరియా సిబ్బంది ప్రదీప్, కిరణ్, సరిత పాల్గొన్నారు.

## సర్దార్ పాపన్న గౌడ్ జయంతి రోజును సెలవు దినంగా ప్రకటించాలి

### బొనగాని యాదగిరి గౌడ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బహుజన విప్లవ వీరుడు, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి (ఆగస్ట్ 18) రోజును సెలవు దినంగా ప్రకటించాలని తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరి గౌడ్ డిమాండ్ చేశారు. మొగల్ సామ్రాజ్యాన్ని ఎదురించి గోల్కొండ కోటను జయంచిన వీరుడు పాపన్న గౌడ్ అని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయనకు సముచిత గౌరవం ఇవ్వాలని కోరారు. భావి తరాలకు తెలిసే విధంగా, పాపన్న గౌడ్ జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాలలో లిఖించాలని తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరి గౌడ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్ పై పాపన్న గౌడ్ విగ్రహన్ని తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు. జనగామ జిల్లాను పాపన్న జిల్లాగా ఆగస్ట్ 18 లోపు ప్రకటించి, వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని యాదగిరి గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఇంటింటా ఇన్నోవేషన్ ఆవిష్కరణలపై అవగాహన



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** ఇంటింటా ఇన్నోవేషన్ ఆవిష్కరణలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని ఇంటర్మీడియట్ నోడల్ అధికారి దేవరాజన్ తెలిపారు. ఇంటింటా ఇన్నివేషన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడానికి రాష్ట్ర ఇన్నివేషన్ సెల్ ఆవిష్కరణలు కోరిన అంశంపై మంగళవారం తన కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాల్స్ తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ నైపుణ్యాలను వినియోగించేందుకు ఇదొక చక్కటి అవకాశమని అన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు సంక్షేమ శాఖల విద్యార్థులు ఆవిష్కరణలు తయారు చేయాలని సూచించారు. ఎలాంటి వయోభేదం లేదని చిన్నా, పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని అన్నారు. మన చుట్టుపక్కల ఉన్నటువంటి సమస్యలని ఇన్నోవేషన్ గా తీర్చిదిద్దాలనుకునేవారికి ఇదొక చక్కటి అవకాశమని, ప్రభుత్వం కూడా ప్రోత్సాహకాలు అందిస్తుందని తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా కో ఆర్డినేటర్ జాడి నరేందర్9440411878కు కాల్ చేయాలని ఆయన సూచించారు.

## కేజీబీవీలో నాన్ టీచింగ్ పోస్టులకు దరఖాస్తులు

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న నైట్ వాచ్ ఉమెన్, స్వీపర్ కమ్ స్కావేంజర్, హెడ్ కుక్ ఉద్యోగాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు పర్వతగిరి మండల విద్యాశాఖ అధికారి సీహెచ్ సత్యనారాయణ రావు, నోడల్ అధికారి గాయపు లింగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే మహిళలు పర్వతగిరి మండలానికి చెందిన వారై వయసు 18 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల మధ్యలో ఉండాలని పేర్కొన్నారు. నైట్ వాచ్ ఉమెన్, హెడ్ కుక్ పోస్టులకు అప్లై చేసుకునే మహిళలు 10వ తరగతి పాసై ఉండాలని, స్వీపర్ పోస్టుకు అప్లై చేసుకునే మహిళలు 7వ తరగతి పాస్ అయి ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు సంబంధిత పత్రాలతో తేదీ జులై 31 నుంచి ఆగస్ట్ 4 వరకు ఉదయం 10:00 నుంచి సాయంత్రం 4.00 గంటల లోపు కేజీబీవీ పాఠశాలలో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు కేజీబీవీ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ నాజియా సల్మాను (7680946704) సంప్రదించ వలసిందిగా పేర్కొన్నారు.

# బురద రోడ్డుకు మరమ్మతులు

### వరంగల్ వాయిస్ కథనానికి స్పందన

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** అడుగు తీసి అడుగు వేసేదెలా అనే శీర్షికన వరంగల్ వాయిస్ పత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. పర్వతగిరి మండలం ఏనుగల్లు గ్రామంలోని అంతర్గత రోడ్లు బురద మయంగా, అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితిలో అంతర్గత రోడ్లు ఉన్నాయని గ్రామస్తులు వరంగల్ వాయిస్ పత్రిక ద్వారా సమస్యను అధికారులకు తెలియజేయడం జరిగింది. జులై 27




అడుగు తీసి అడుగు వేసేదెలా?
అధ్వానంగా అంతర్గత రోడ్లు
బురదమయంగా గ్రామ రహదారులు
సమస్యలు పరిష్కరించాలి..
వరంగల్ వాయిస్
epaper.warangalvoice.net
27 Jul 2024 - Page 5

2024 రోజున అడుగు తీసి అడుగు వేసేదెలా అనే శీర్షికన కథనం ప్రచురించడం జరిగింది. స్పందించిన అధికారులు బురదమయంగా ఉన్న రోడ్లను చిప్స్ కంకరతో మరమ్మతులు చేయించారు. బురద రోడ్ల సమస్యను పరిష్కరించినందుకు వరంగల్ వాయిస్ పత్రికకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలకు వ్యతిరేకం

### బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలకు వ్యతిరేకంగా ఉందని, వ్యవసాయ కార్మికులకు నిరాశే మిగిలిందని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యులు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు మంగళవారం హనుమకొండలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధి వర్గం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట్రాములు ప్రసంగిస్తూ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి అరకొరగా నిధులు కేటాయించడంతో రెక్కాడితే కానీ డొక్కాడని శ్రమజీవులైన కూలీల బతుకులు దుర్భరమవుతున్నాయని, ఇప్పటికైనా కేంద్రం ఉపాధి పనులకు 2 లక్షల70 వేల కోట్లు నిధులు కేటాయించి సంవత్సరంలో 200 రోజులు పనులు కల్పించి రోజుకు రూ.700 కూలీ ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి గృహ నిర్మాణానికి ఆరు లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందించాలని, కూలీలకు సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇస్తామన్న వాగ్దానాన్ని వెంటనే అమలు పరచాలని డిమాండ్ చేశారు. జాతీయ నాయకులు మోతె లింగారెడ్డి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు మునిగాల భిక్షపతి, రాజమని, నాయకులు రాజయ్య, శిరీష, పద్మ, లక్ష్మీ, మదనమ్మ, అంబాల స్వామి, మహేష్ తదితరులు ప్రతినిధి వర్గంలో ఉన్నారు.

## అస్తవ్యస్తంగా జీపీ నిర్మాణం పనులు

### అధికారుల పర్యవేక్షణ లోపం



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని కొంకపాకలో అస్తవ్యస్తంగా జీపీ బిల్డింగ్ నిర్మాణ పనులను సంబంధిత కాంట్రాక్టర్ నిర్వహిస్తున్నాడని గ్రామస్తులు ఆగ్రహిస్తున్నారు. ఎస్టిమేషన్ లో ఉన్నట్లు కాకుండా కాంట్రాక్టర్ తన ఇష్టారాజ్యంగా పనులు నిర్వహిస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. బేస్ మెంట్ లెవల్ లో నిర్మాణం ఈ విధంగా ఉంటే బిల్డింగ్ పూర్తయ్యే వరకు ఇంకా ఎలా ఉండాలని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నిర్మాణ సమయంలో పర్యవేక్షణలో ఉండాల్సిన ఆఫీసర్లు ఎవరూ లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు నిర్వహిస్తున్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పాత బిల్డింగ్ సంబంధించి బేస్ మెంట్ రాళ్లు తీసి నిర్మాణానికి అవే వాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాణ్యత ప్రమాణాలు లేకుండా నిర్మాణ పనులు నిర్వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు నిర్మాణ సమయంలో పర్యవేక్షణ నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

## గంజాయి కేసులో ఇద్దరికీ 20ఏళ్ల శిక్ష



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్సీ, బీసీ కాలనీ రోడ్డుపై అప్పటి ఎస్ఐ భద్రునాయక్ తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీ నిర్వహిస్తుండగా కామేపల్లి మండలం లింగాల రోడ్డు నుంచి వస్తున్న ట్రాక్టర్ ను ఆపి తనిఖీ నిర్వహించగా వెనుక భాగంలో 150 గంజాయి ప్యాకెట్స్ (300 కేజీల సుమారు 30 లక్షలు విలువ) దొరికాయి. వీటిని తరలిస్తున్న నిందితుల మరిపెడ మండలం తండ ధర్మారాంకు చెందిన బానోత్ కిరణ్ కుమార్, భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన బదావత్ సూర్యలను అదుపులోకి తీసుకోని ఎన్డీపీఎస్ యాక్ట్ ప్రకారం జిల్లా జడ్జీ పి.చంద్రశేఖర ప్రసాద్ ముందు హాజరు పరిచారు. విచారణ జరిపిన ఆయన వీరిద్దరిపై నేరం రుజువు కావడంతో ఇద్దరికీ 20 సంవత్సరాల కఠిన కారాగారా శిక్ష, ఒక్కొక్కరికి రూ.2 లక్షల రూపాయలు జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కోర్టు డ్యూటీ ఆఫీసర్‌ను మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అభినందించారు.

వరంగల్ వాయిస్ Evening Daily
మంగళవారం 30, జులై 2024
www.warangalvoice.net

# సమస్య జటిలం.. పరిష్కారం శూన్యం

## యూనియన్ బ్యాంకులో ఖాతాదారుల అరిగోస

### పట్టించుకోని బ్యాంక్ అధికారులు




**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** ఈ బ్యాంకుకు రావాలంటే ఖాతాదారులు నిత్యం అరిగోస పడుతున్నారు. బ్యాంకుకు వచ్చి పోయేటోళ్ల సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతుండడంతో ఖాతాదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇది కొంతకాలంగా నెలకొన్న సమస్య కాగా, బ్యాంకుకు వచ్చే ఖాతాదారుల బైకులు పార్క్ చేయడానికి స్థలం లేకపోవడంతో రోడ్డుపైనే పార్క్ చేయాల్సిన పరిస్థితి ఇక్కడ నెలకొంది. ఇంతకీ ఆ బ్యాంకు ఎక్కడ ఏ ఊర్లో అనుకుంటున్నారా ! ఎక్కడో కాదు హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకు పరిస్థితి. ఇది ఇప్పటి సమస్య కాదు ఎప్పటి నుండో కొనసాగుతూ వస్తున్న సమస్య. బ్యాంకు చిన్నది అయినప్పటికీ ఇక్కడ ఖాతాదారుల సంఖ్య వేలల్లో ఉంది. నిత్యం కమలాపూర్ మండలంలోని పలు గ్రామాల నుంచి బ్యాంకుకు వచ్చే ఖాతాదారుల సంఖ్య వందల్లోనే ఉంటుంది. ఇక్కడికి వచ్చే బ్యాంకు కస్టమర్లు తమ బైకులను పార్కు చేయాలన్న అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పార్క్ చేయడానికి స్థలం లేకపోవడంతో రోడ్డుపైనే పార్క్ చేయడంతో అటు వాహనదారులకు, ప్రయాణికులకు అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తరచూ ఇక్కడ ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో పాటు చిన్న చిన్న ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఇవేమీ పట్టనట్లు బ్యాంకు అధికారులు వ్యవహరిస్తుండడంతో సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. ఈ సమస్యకు పరిష్కారంకు చూపాల్సిన బ్యాంకు అధికారి నిమ్మకు నీరెత్తినట్టు ఉండడంతో సమస్యతో ఖాతాదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పార్కింగ్ స్థలం ఉన్న పెద్ద భవనంలోకి బ్యాంకును మారిస్తే సమస్య తీరుతుందని ఖాతాదారులు పలుమార్లు ఆఫీసర్ల దృష్టికి తీసుకువచ్చినా ఫలితం లేకపోయింది. స్థానిక ప్రజాప్రతినిధులు సైతం బ్యాంకును పెద్ద బిల్డింగ్‌లోకి మార్చాలని ట్రాఫిక్ సమస్య ఇబ్బందవుతుందని చెప్పినా ఫలితం లేదు. ఖాతాదారులు మాత్రం బ్యాంకును వేరే చోటికి మారిస్తేనే సమస్య తీరుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకో విశేషం ఏమిటంటే ఈ బ్యాంకులో నిత్యం రద్దీతో, పార్కింగ్ సమస్య ఇబ్బంది తట్టుకోలేక చాలామంది తమ ఖాతాలను బ్యాంకు నుంచి ఉపసంహరించుకొని వేరే బ్యాంకులో కొత్త అకౌంట్లు తీసుకొనిపోతున్న పరిస్థితి. ఇప్పటికైనా బ్యాంక్ అధికారులు దిద్దుబాటు చర్యలు చేపడతారా లేక మిన్నకుంటారా అనేది చూడాలి.

## ఉద్యోగ విరమణతో బాధ్యతలు పెరుగుతాయి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** "అనుభవజ్ఞులైన ఉద్యోగులు ఉద్యోగ విరమణతో ప్రస్తుత ఉద్యోగుల బాధ్యతలు పెరుగుతాయి" అని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయ అభివృద్ధి అధికారి కార్యాలయంలో అభివృద్ధి అధికారి ఆచార్య ఎన్.వాసుదేవ రెడ్డి అధ్యక్షతన నేడు యూనివర్సిటీ ఇంజినీరింగ్ జి.భవాని ప్రసాద్ ఉద్యోగ విరమణ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రాధాన్యత క్రమంలో ఉన్న తరువాతి ఉద్యోగుల బాధ్యత పెరుగుతుందన్నారు. ఉద్యోగ విరమణ చేస్తున్న ఉద్యోగిలో ఉన్న గొప్ప లక్షణాలు, పని సంస్కృతి, వారు అవలంభించిన విధానాలు, విధుల పట్ల వారికీ ఉన్న మక్కువ, ఆసక్తిని చూడాలని, నేర్చుకోవాలని, కొనసాగించాలని కోరారు. ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగి తన ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, తన ఆసక్తి ఉన్న రంగంలో సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆచార్య వి.రామచంద్రం, ఆచార్య ఆర్.మల్లికార్జున రెడ్డి, పొన్నాల రామయ్య, సిబ్బంది పాల్గొన్నారు. భవాని ప్రసాద్ దంపతులను శాలువా, జ్ఞాపిక, బోకేతో సన్మానించారు.

## ఘనంగా ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ డైరెక్టర్ బాబురావు జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని రంగశాయిపేటలో మంగళవారం ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ డైరెక్టర్ ఘట్టమనేని బాబురావు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. తెలంగాణలో 8జిల్లాలో జన్మదిన వేడుకలు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా వరంగల్ నగరంలోని 42వ డివిజన్ రంగసాయిపేటలో మంగళవారం 250 మందికి లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో బాబురావు జన్మదిన సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ కుందూరు వెంకట్ రెడ్డి, ఐపీడీజీ ఎన్ వెంకటేశ్వరరావు, ఎఫ్ వీడీజీ డాక్టర్ కౌడి చంద్రశేఖర్ ఆర్య, ఎస్ వీడీజీ ఎన్.సుధాకర్ రెడ్డి , ఆర్ సీ డాక్టర్ గాండ్ల సురేష్ కుమార్, జడ్సీ మార్గం ప్రభాకర్, ప్రెసిడెంట్లు పి.చంద్రమోహన్, షేర్ల అనిల్ కుమార్, డాక్టర్ కౌడి రాజేశ్వరి, నర్సింహారెడ్డి, సునీత రెడ్డి, ధర్మేందర్, చిగిరి పూర్ణ చందర్, గుండెబోయిన విష్ణువర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలుకు దశల వారి ఆందోళన



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై జరుగు దశల వారి ఆందోళనలను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజా పంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. మహబూబాబాద్ లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఒక సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రుణమాఫీని అమలు చేయడంలో అనేక లోపాలను జరుగుతున్న వాటిని సరి చేయడం లేదన్నారు. నేడు చేసిన రెండో విడత రుణమాఫీలో సైతం వేల మంది అర్హులైన రైతులకు లిస్టులో పేర్లు రాలేదన్నారు. ప్రతి ఇంటికి రేషన్ కార్డు ఇస్తామని చెప్పిన మాట బుట్ట దాఖలు అయిందని, ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలంతో పాటు ఇల్లు నిర్మాణానికి ఐదు లక్షల ప్రభుత్వ సహాయం చేస్తానన్న హామీ బడ్జెట్ లో పెట్టకుండా ఇల్లు నిర్మాణం కోసం సహాయం చేయటం లేదనే విషయాన్ని చెప్పకుండానే చెప్పారన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలను ఖాళీలను భర్తీ చేయడానికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పిన మాటలు ఆచరణ రూపం దాల్చడం లేదన్నారు. రాష్ట్రంలో ఉన్న లక్షలాదిమంది కార్మికులకు కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని అందరికీ పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని రవి డిమాండ్ చేశారు. విద్యా రంగానికి కేటాయింపులు గత ప్రభుత్వాల బాటలోనే నడిచి ఫీజు రియింబర్స్ మెంట్ గానీ, స్కాలర్ షిప్ మెస్ ఛార్జిల పెంపు కోసం గాని కేటాయింపులు చేయలేదన్నారు. మహిళా గ్రూపులకు జీరో వడ్డీ రుణాలు స్వయం సహాయక బృందాలు ద్వారా ఆర్థిక స్థలం మన కోసం చేయాల్సిన కృషిని చేయటం లేదన్నారు. ఒక మాటలో చెప్పాలంటే రాష్ట్ర ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీల అమలకు పూలుకోవటం లేదన్నారు. దానికి నిరసనగా సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు1న మండల కేంద్రాలలో, ఆగస్టు 8న జిల్లా కలెక్టరేట్ల ముట్టడి, ఆగస్టు 21న చలో హైదరాబాద్ నిర్వహిస్తున్నామని రవి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఇచ్చిన హామీల అమలు కోసం నిర్దిష్టమైన విధివిధానాలను ప్రకటించకపోతే ఈ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి బిల్లా కంటి సూర్యం, డివిజన్ నాయకులు కందాల రంగయ్యతో పాటు యాదయ్య, భాస్కర్, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఉమ్మడి వరంగల్ జిల్లాలో గత పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు రావటంతో ప్రజలు ముఖ్యంగా చిన్న పిల్లలు తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. జిల్లాలో విష జ్వరాలు పెరుగుతున్నాయి. పిల్లల ఆరోగ్యం పట్ల , ఆహారం పట్ల తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. రోడ్డు ప్రక్కన ఎటువంటి తినుబండారాలు తినవద్దని ఇంటి వద్దనే వేడి వేడిగా వండిన ఆహార పదార్థాలు పిల్లలతో పాటు పెద్దలు కూడా తీసుకోవాలన్నారు. తాగే నీటి పట్ల కూడా తగు జాగ్రత్త వహించాలని, చేతులు శుభ్రంగా కడుక్కొని ఆహార పదార్థాలు భుజించాలని ఏవైనా ఇబ్బందులు తలెత్తితే సొంత వైద్యం చేసుకోకుండా నిపుణులైన డాక్టర్ల పర్యవేక్షణలో వైద్య సేవలు పొందాలని ఆయన కోరారు.

## కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు



**వరంగల్ వాయిస్, పాలకుర్తి :** నియోజకవర్గంలోని పాలకుర్తి, దేవురుప్పల, కొడకండ్ల, రాయపర్తి, తొర్రురు, పెద్దవంగర, తొర్రూరు పట్టణానికి, చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రధాన అనుచరులు నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ఝాన్సీ రాజేందర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ చేరారు. మంగళవారం పాలకుర్తి మండల కేంద్రంలోని బృందావనం గార్డెన్ లో పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఝాన్సీ రాజేందర్ రెడ్డి సమక్షంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన సుమారు 2000 మంది కార్యకర్తలతో కలిసి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. నియోజకవర్గ ఇంచార్జి ఝాన్సీ రాజేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇంచార్జి ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ ఏ ఎన్నికలు వచ్చినా గెలిచేది నిలిచేది కాంగ్రెస్ పార్టీనేనని, లోకల్ బాడీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటుతుందని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీని పాలకుర్తి నియోజకవర్గంలో పూర్తిగా భూస్థాపితం చేయాలన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాత కొత్త లేకుండా కలిసి పార్టీ బలోపేతం కోసం పని చేయాలని పిలుపు నిచ్చారు. రాబోయే రోజుల్లో పాలకుర్తిలో బీఆర్ఎస్ పార్టీకి డిపాజిట్లు దక్కకుండా కాంగ్రెస్ కార్యకర్తలు పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, వివిధ మండలాల అధ్యక్షులు, జిల్లా, మండల, సీనియర్ నాయకులు, యూత్ నాయకులు, మహిళ నాయకులు, సోషల్ మీడియా నాయకులు, మహిళ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## వన్నాలకు పలువురి పరామర్శ




**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** వర్ధన్నపేట మాజీ శాసన సభ్యుడు, భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వన్నాల శ్రీరాములును పోపా ఆల్ ఇండియా ప్రెసిడెంట్ గంగాధర్ తిలక్ కుంతాల, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ వేముల నాగరాజు, తెలంగాణ ఆన్ లైన్ మీడియా వర్కింగ్ జర్నలిస్టులు అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి వేముల సదానందం నేతలు మంగళవారం పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములుకు ఇటీవల సికింద్రాబాద్ లోని యశోద హస్పిటల్ లో మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్స జరిగింది. తీవ్రమైన మోకాలి కీళ్లనొప్పులతో బాధపడుతున్న వన్నాల శ్రీరాములుకు మేస్ట్ అడ్వాన్స్ డ్ మినిమల్లీ ఇన్వాసిస్ శస్త్రచికిత్స చేశారు. ఈ మోకాలి మార్పిడి శస్త్రచికిత్స ద్వారా దెబ్బతిన్న మోకాలి కీలు భాగాలను తిరిగి పొందుతారు. కీలకమైన రెండు మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు చేసుకున్న వన్నాల శ్రీరాములును ఆరోగ్య పరిస్థితుల గురించి వారు అడిగి తెలుసుకున్నారు. సుమారు ఎనిమిది పదుల వయస్సులో మోకాలి మార్పిడి శస్త్రచికిత్స చేసుకున్న వన్నాల శ్రీరాములు తీసుకుంటున్న జాగ్రత్తల గురించి వారు అడిగి తెలుసుకున్నారు. క్రమం తప్పకుండా ఫిజియోథెరఫీ చేసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. వన్నాల శ్రీరాములు వీలైనంత త్వరగా యథాస్థితికి చేరుకోవాలని గంగాధర్ తిలక్ కుంతాల, వేముల నాగరాజు, వేముల సదానందం నేతలు ఆకాంక్షించారు.



# టీజర్‌పై .. పెదవి విరుపులు

దర్శకుడు హరీష్ శంకర్, రవితేజ కాంబినేషన్ లో వస్తున్న 'మిష్టర్ బచ్చన్' టీజర్ విడుదలైంది. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ ఈ సినిమాని నిర్మిస్తోంది. టీజర్ ఫంక్షన్ కి రవితేజ వస్తాడు అనుకున్నారు, కానీ అతను రాలేదు. మామూలుగానే దర్శకుడు హరీష్ శంకర్ తన మాటలతో, సామాజిక మాధ్యమాల్లో వివాదాలతో ఉంటూ వస్తూ ఉంటాడు. అందుకేనేమో టీజర్ కన్నా, అతను మీడియా వాళ్ళతో మాట్లాడిన మాటలే ఎక్కువ వైరల్ అయినట్టుగా కనపడుతోంది.అందుకే 'మిష్టర్ బచ్చన్' టీజర్ కూడా అంత గొప్పగా లేకపోవటంతో, టీజర్ ని ఎవరూ పట్టించుకోలేదు. హరీష్ శంకర్ వ్యాఖ్యలు, వివాదాల మాటలే ఎక్కువగా అందరినీ ఆకర్షించాయని అనుకుంటున్నారు. ఈ 'మిష్టర్ బచ్చన్' సినిమా ఇంతకు ముందు అజయ్ దేవగన్ నటించిన 'ది రైడ్' సినిమాకి అనువాదంగా చేస్తున్నారు. అయితే ఈ సినిమా ఎక్కువగా ప్యాకేజీలో హరీష్ శంకర్ తీశాడని పరిశ్రమలో వినిపిస్తున్న మాట. అందుకనే ఈ సినిమాపై అంతగా ఆశలు పెట్టుకొనవసరం లేదు అని కూడా అంటున్నారు. టీజర్ ఫంక్షన్ కి రవితేజ రాకపోవటంతో రకరకాలుగా మాట్లాడు కుంటున్నారు. రవి తేజకి ఈ సినిమా ఫలితం ముందే తెలుసు, అందుకే రాలేదు అని, లేదు అతనికి ప్రొడక్షన్ హౌస్ కి మధ్య ఇంకా కొన్ని విషయాలు తేలలేదు అందుకని రాలేదు, అని అక్కడికి వచ్చిన వాళ్ళు మాట్లాడుకోవటం కనిపించింది. రవితేజ రాకపోవటంతో వచ్చిన అభిమానులు చాలా నిరాశ పడ్డారు. టీజర్ లో సినిమా గురించి ఇంకా కొంచెం రివీల్ చేస్తే బాగుండేది, హరీష్ శంకర్ టీజర్ లో విషయం చూపించలేకపోయారు అని కూడా అంటున్నారు.



# అమితాబ్ విగ్రహం.. గూగుల్ గుర్తింపుతో వెలుగులోకి

బాలీవుడ్ విలక్షణ నటుడు అమితాబ్ బచ్చన్‌కు ప్రపంచవ్యాప్తంగా అభిమానులున్న సంగతి తెలిసిందే! కొందరు అభిమానులు ఆయనపై ప్రత్యేక అభిమానం చాటుకుంటారు. కోల్‌కత్తాలోని శ్రీ ధార్ రాయ్ రోడ్ ప్రాంతంలో ఆయనకు గుడి కూడా కట్టారు. ఇప్పుడు మరో అభిమాని ఆయనపై ఉన్న ప్రేమాభిమానాన్ని ప్రత్యేకంగా చాటుకున్నాడు. న్యూజెర్సీకి చెందిన గోపీసేథ్ దాదాపు రెండేళ్లక్రితం తన నివాసం ఎదుట అమితాబ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయించాడు. రెండేళ్ల తర్వాత ఇది గూగుల్ గుర్తింపు పొందింది. పర్యాటక ప్రాంతంగా గూగుల్ దీనిని గుర్తించింది. ఈ విషయంపై గోపీసేథ్ ఆనందం వ్యక్తంచేశారు. 'మా నివాసం ఇప్పుడు ప్రముఖ పర్యాటక కేంద్రంగా మారింది. దానికి కారణమైన అమితాబ్ విగ్రహానికి ధన్యవాదాలు. గూగుల్ గుర్తింపు కారణంగా రోజురోజుకీ పర్యటకుల సంఖ్య పెరుగుతుంది. ఈ విగ్రహాన్ని చూసేందుకు ప్రపంచం నలుమూలల నుంచి ఎంతోమంది ఇక్కడికి వస్తున్నారు. అమితాబ్ తమలో ఏవిధంగా స్ఫూర్తి నింపారో తెలియజేస్తూ పలువురు గ్రీటింగ్ కార్డులు వదిలివెళ్తున్నారు. ఇక్కడికి వచ్చిన చాలామంది ఫ్యాన్స్ విగ్రహంతో ఫొటోలు, వీడియోలు తీసుకుని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. అలా మా ఈ ప్రాంతానికి మరింత ప్రజాదరణ సొంతమైంది' అని గోపీసేథ్ తెలిపారు. ఇండో అమెరికన్ వ్యాపారవేత్త గోపీ న్యూజెర్సీలోని ఎడిసన్ సిటీలో నివాసం ఉంటున్నాడు. ఆయనతోపాటు కుటుంబ సభ్యులకూ బచ్చన్ అంటే అభిమానం.

# విజయభాస్కర్ దర్శకత్వంలో..




నువ్వేకావాలి, మన్మథుడు, మల్లీశ్వరి వంటి క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రాలను తెరకెక్కించిన ప్రముఖ దర్శకుడు కె.విజయ్ భాస్కర్ దర్శకత్వంలో తాజాగా మరో లవ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ రాబోతుంది. ఉషా పరిణయం అనే బ్యూటిఫుల్ టైటిల్‌తో రూపొందిన ఈ చిత్రానికి లవ్ ఈజ్ బ్యూటిఫుల్ అనేది ఉపశీర్షిక. ఈ చిత్రంలో శ్రీకమల్, తన్వీ ఆకాంక్ష, సూర్య ముఖ్యతారలు. ఆగస్టు 2న చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. మెగా సుప్రీమ్ హీరో సాయి దుర్గ తేజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.దర్శకుడు విజయ్ భాస్కర్ మాట్లాడుతూ 'సాయి ద రియల్‌హీరో.. సాయి దుర్గ తేజ్ హీరోగానే కాకుండా సమాజం గురించి కూడా ఆలోచిస్తాడు. పద్నాలుగేళ్ల తరువాత సాయిను చూస్తున్నాను. సాయిని 14 ఏళ్ల క్రితం పవన్‌కల్యాణ్ గారి నిర్మాణ సారథ్యంలో నేనే హీరోగా ఇంట్రడ్యూస్ చేయాలి కానీ కుదరలేదు. ఆ రోజు ఎంత వినయంగా, సంస్కారంతో ఉన్నాడో.. ఈ రోజు అలాగే ఉన్నాడు, చిరంజీవి గారి దగ్గర ఉన్న ప్రేమ సాయిలో కనిపించింది. మా టీమ్‌ను ఎంకరైజ్ చేయడానికి వచ్చినందుకు ఆనందంగా ఉంది. నాకు ఎటువంటి ఇబ్బంది లేకుండా మా ఫ్యామిలీ సపోర్ట్‌తో ఈ సినిమా నిర్మించాను. ఈ చిత్రానికి ధ్రువన్ చాలా మంచి సంగీతం ఇచ్చాడు. సతీష్ ఫోటోగ్రఫీ ఈసినిమాకు ఎంతో ప్లస్ అయ్యింది. తన్వీ చాలా కంఫర్టబుల్ హీరోయిన్. కాశ్మీర్‌లో ఎంత ఇబ్బందైనా అంత చలిలో కూడా ఎంతో సహకరించింది. సినిమాలో టెక్నిషియన్స్, ఆర్టిస్ట్ కూడా ఎంతో ఓన్ చేసుకుని ఈ సినిమా చేశారు' అన్నారు. ఈ సినిమాను అందరూ థియేటర్‌లో చూసి మమ్ములను ఎంకరైజ్ చేయాలని కోరుకుంటున్నాను. నాన్న గారి పేరు నిలబెట్టడానికి ప్రయత్నిస్తాను. తాన్వీ ఆకాంక్ష.. చాలా మంచిగా పెంచారు. చాలా కంఫర్టబుల్ నో ప్రాబ్లమ్ గర్ల్. ఆమెతో మళ్లీ మళ్లీ పనిచేయాలని కోరుకుంటున్నాను. మా చెల్లి, బావ ఈ సినిమా నిర్మాణంలో ఎంతో సహకరించారు. అందరికి సినిమా నచ్చుతుందని ఆశిస్తున్నాను అన్నారు.

# ఓదెల సినిమా కోసం బోనం ఎత్తిన తమన్నా




మిల్కీ బ్యూటీ తమన్నా ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం ఓదెల 2. ఓదెల సినిమాకు సీక్వెల్‌గా వస్తున్న ఈ సినిమాకు టాలీవుడ్ దర్శకుడు సంపత్ నంది కథను అందిస్తుండగా.. అశోక్ తేజ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం పాన్ ఇండియా లెవల్లో రిలీజ్ అవ్వడానికి సిద్ధం అవుతుంది. అయితే హైదరాబాద్ ఆషాడ బోనాల పండుగ సందర్భంగా చిత్రబృందం పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో తమన్నా బోనం ఎత్తుకుని వస్తున్నట్లు పోస్టర్ ఉంది. కాగా ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఈ సినిమాలో తమన్నా శివశక్తి అనే పాత్రలో నటిస్తుండగా.. మహదేవ్‌కు పరమభక్తురాలిగా కనిపించనుంది. ఓదెల సద్గుణ రక్షకురాలిగా ఇందులో కనిపించనుంది. ఓదెల 2 చిత్రంలో వశిష్ఠ ఎన్ సింహా, హరిప్రియ ఇతర ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని సంపత్ నంది టీమ్ వర్క్స్ బ్యానర్, మధు క్రియేషన్స్‌పై తెరకెక్కిస్తున్నారు. కాంతార చిత్రానికి గూస్‌బంప్స్ తెప్పించే మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సమకూర్చిన అజనీష్ లోక్‌నాథ్ ఈ మూవీకి సంగీతం అందిస్తుండటంతో అంచనాలు భారీగా నెలకొన్నాయి. ఓదెల 2 షూటింగ్‌ను ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం కాశీలో మొదలుపెట్టారని తెలిసిందే. ఈ ఫొటోలు ఇప్పటికే ఆన్‌లైన్‌లో హల్ చల్ చేస్తున్నాయి.



# మరో పాట విడుదల

ఉస్తాద్ రామ్ పోతినేని , డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్‌ల డెడ్లీ కాంబినేషన్‌లో సంజయ్ దత్ పవర్ ఫుల్ పాత్రలో ,కావ్య థాపర్ కథానాయికగా తెరకెక్కిన మోస్ట్-వెయిటెడ్ పాన్ ఇండియా మూవీ 'డబుల్ ఇస్మార్ట్' ఆగస్ట్ 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా సినిమా యూనిట్ ప్రమోషన్స్ కార్యక్రమాల్లో వేగం పెంచుతూ రెండు పాటలను విడుదల చేసి సినిమాను ప్రజల్లోకి తీసుకెల్లే ప్రయత్నాలు చేసింది. తాజాగా ఇప్పుడు ఈ చిత్రం మూడో సింగిల్ 'క్యా లఫ్డా' అంటూ సాగే పాటను విడుదల చేశారు. ఇప్పటివరకు వచ్చిన ఫస్ట్ సింగిల్ 'స్టెప్పా మార్', సెకెండ్ సింగిల్ 'మార్ ముంత చోడ్ చింత' అదిరిపోయే స్పందనను రాబట్టుకోగా ఇప్పుడు మేకర్స్ థర్డ్ సింగిల్ 'క్యా లఫ్డా' ప్రోమోతోనే మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. తాజాగా విడుదలైన పాట కూడా వాటిని మించేలా మంచి మెలోడియస్‌గా ఉంది.



# అడ్డదిడ్డంగా పార్కింగ్

## అడుగు తీసి అడుగు వేయాలంటే కష్టం

నిత్యం వేలాది మంది భక్తులతో కిటకిటలాడుతున్న నగరంలోని సుప్రసిద్ధ భద్రకాళి దేవాలయంలో వాహనాల పార్కింగ్ ఇష్టారాజ్యంగా మారింది. ప్రధాన గేటు లోపలికి ప్రైవేట్ వాహనాల నిషేధం ఉన్నప్పటికీ పట్టించుకునే వారే కరువయ్యారు. ఒకవైపు అడ్డదిడ్డంగా వాహనాల నిలిపివేత మరోవైపు బిచ్చగాళ్ల హంగామాతో భక్తులు భయాందోళనకు గురవుతున్నారు. అడుగు తీసి అడుగు వేయాలంటేనే జంకుతున్నారు. - వరంగల్ వాయిస్, వరంగల్

# రైతుకు రుణమాఫీ ఫలాలు అందాలి

## టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు

## జిల్లా కలెక్టర్‌తో కలిసి చెక్కుల పంపిణీ



వరంగల్ వాయిస్, వరంగల్ : దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రైతాంగానికి రుణ విముక్తి చేసి రైతు రుణం తీర్చుకున్న ఏకైక ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అని తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు అన్నారు. మంగళవారం వరంగల్ కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు రుణ మాఫీ-2024 రెండో విడత కార్యక్రమాన్ని వరంగల్ కలెక్టర్ సత్య శారదతో కలిసి రవీందర్ రావు ప్రారంభించారు. లక్ష నుంచి లక్షన్నర వరకు రుణాలు ఉన్న రైతులందరికీ రెండో విడత కింద ప్రభుత్వం రుణమాఫీ చేసిందన్నారు. రుణమాఫీ ఫలాలు జిల్లాలోని రైతులకు వర్తించేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని రవీందర్ రావు కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్య శారదా మాట్లాడుతూ జిల్లాలోని మొత్తం 14,510 మంది రైతులకు రూ.142.58 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. వీటిని వచ్చే వారం రోజుల్లో రైతులకు పూర్తి స్థాయిలో పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతుల రుణాలు రెన్యూవల్ చేసి రుణమాఫీ ఫలాలు రైతులకు అందేలా బ్యాంకర్లు వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, టెస్కాబ్ చైర్మన్, ఆదనపు కలెక్టర్ చేతుల మీదుగా రెండో విడత రైతు రుణ మాఫీ చెక్కు ను రైతులకు అందజేశారు. అనంతరం రుణమాఫీ సందర్భంగా రైతులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపడంతోపాటు సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషా దయాల్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజు, జిల్లా ఉద్యానవనాల అధికారి శ్రీనివాసరావు, జిల్లా సహకార అధికారి సంజీవ రెడ్డి, మండల అధికారులు, పీఏస్ సీఎస్ సొసైటీ చైర్మన్లు, సీఈఓలు, బ్యాంక్ బ్రాంచి మేనేజర్లు, ప్రజా ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులు 14,700

## రుణమాఫీ రూ.143.8 కోట్లు

## హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య



వరంగల్ వాయిస్, హనుమకొండ : రాష్ట్రంలో రెండో విడత రూ.1 లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు రుణ మాఫీ విడుదల కార్యక్రమాన్ని మంగళవారం మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, గుత్తా సుకేందర్ రెడ్డితోపాటు ఇతర శాసన సభ్యులతో కలిసి అసెంబ్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల రుణ మాఫీ చేస్తామని ఎన్నికల సమయంలో చెప్పిన మాటలు నిజం చేయడం గర్వంగా ఉందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ మొదటి విడుతలో 25 వేల మంది రైతులకు రూ.142కోట్ల మొత్తం రుణ మాఫీ జరిగిందన్నారు. అలాగే ప్రస్తుతం రెండో విడుతలో 14,700 మంది రైతులకు రూ.143.83 కోట్ల రుణ మాఫీ జరిగినట్లు తెలిపారు. కొన్ని సాంకేతిక కారణాలతో 300 మంది రైతులకు రుణ మాఫీ నమోదు కాలేదన్నారు. త్వరలోనే వీరికి కూడా రుణ మాఫీ జరిగేట్లు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు . బ్యాంకర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి రుణ మాఫీ మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాలో జమ అయ్యేట్లు చర్యలు తీసుకున్నామన్నారు. 3వ విడుత రానున్న 10-15 రోజులల్లో చేపట్టనున్నట్లు ప్రకటించారు. ప్రతి మండల కేంద్రంలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసినట్లు, ప్రతి బ్యాంక్ ముందు గ్రీవెన్స్ సెల్ ఫోన్ నెంబర్లను ప్రదర్శిస్తున్నాయని రైతులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎల్లప్పుడూ రుణ మాఫీకి సంబంధించిన అన్ని పనులు సకాలంలో చేస్తున్న అధికారులను అభినందిస్తూ, ఎక్కడ ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండ ఎప్పటికప్పుడు సరైన సమాచారంతో అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. అక్కడికి వచ్చిన రైతు రుణ మాఫీ లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడుతూ వారి ఊరు పేరు, వారికి అయిన రుణ మాఫీ మొత్తం, ఈ సారి వేసిన పంటల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులకు రుణ మాఫీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ కొన్ని సాంకేతిక కారణాల వల్ల రైతులకు రుణ మాఫీ జరగకపోతే మానవతా దృక్పథంతో తప్పులు సరి చేసి రైతులకు రుణ మాఫీ జరిగేట్లు బ్యాంకర్లు సహకరించాలన్నారు. వచ్చిన రుణ మాఫీని వేరే పనులకు ఉపయోగించకుండా వ్యవసాయానికి మాత్రమే ఉపయోగించుకొని అభివృద్ధి చెందాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, డీసీఓ నాగేశ్వర రావు, జిల్లాలో ఉన్న బ్యాంక్ మేనేజర్లు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ పెద్ద కొడుకు సోమేశ్ కుమార్

## జీఎస్టీ కుంభకోణంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి

## సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి

వరంగల్ వాయిస్, హనుమకొండ : అవినీతి, అక్రమాలలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు మాజీ సీఎస్ సోమేశ్ కుమార్ పెద్ద కొడుకు లాంటి వాడని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి విమర్శించారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ చీఫ్ సెక్రటరీగా పనిచేసిన కాలంలో సోమేశ్ కుమార్ రూ.1,400 కోట్ల మేర జీఎస్టీ అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయన్నారు. ఇంత జరిగినా కేసీఆర్ తన ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై స్పందించడం లేదని విమర్శించారు. పైగా సీఎస్ గా వాలంటరీ రిటైర్ మెంట్ తీసుకున్న సోమేశ్ కుమార్ ను ప్రభుత్వ సలహాదారుగా కేసీఆర్ నియమించాడని ఎద్దేవా చేశారు. సోమేశ్ కుమార్ వ్యవహారంలో కేసీఆర్ కు తలదించుకునే పరిస్థితి వచ్చిందన్నారు. సోమేశ్ కుమార్ వ్యవహారంపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి అక్రమాలకు అంతం పలకాలంటే శిక్షలు పడాలన్నారు. ప్రస్తుతం కేసీఆర్ పాలనలో జరిగిన ఒక్కో అవినీతి బహిర్గతం అవుతోందన్నారు. కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలున్న రాష్ట్రాలపై వివక్ష చూపారన్నారు. తెలంగాణకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఇక్కడి బీజేపీ నాయకులు తలెత్తుకుని తిరిగే పరిస్థితి లేదన్నారు. తెలంగాణ నిధుల కోసం బీజేపీ ఎంపీలు కేంద్రంపై పోరాడాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తేవాలని సూచించారు.

### ఆగస్టులో రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు..

సీపీఐ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలను ఆగస్టు 22,23,24 తేదీల్లో హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్ లో నిర్వహించనున్నట్లు చాడ వెంకట్ రెడ్డి ప్రకటించారు. ఈ సమావేశాల్లో ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కార్యాచరణపై చర్చించనున్నట్లు వెల్లడించారు. ఈ విలేఖరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు ఎన్.అశోక్ స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రె లక్ష్మణ్, మునిగాల భిక్షపతి, బాషబోయిన సంతోష్, కొట్టెపాక రవి తదితరులు పాల్గొన్నారు.

# 24/7 చలివేంద్రం ప్రారంభం



వరంగల్ వాయిస్, కాజీపేట : నాగ సాయి చంద్ర హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో మూడు కాలాల పాటు 24/7 చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని హనుమకొండ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ కె.దేవేందర్ రెడ్డి అన్నారు. నాగ సాయి చంద్ర హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు నూగురి చంద్ర మోహన్, కోర్ కమిటీ సభ్యుల సహకారంతో మంగళవారం హనుమకొండ బీఈడి కళాశాల ఎదురుగా ఏర్పాటు చేసిన నిత్య చలి వేంద్రాన్ని గౌరవ అతిథి హనుమకొండ సీఐ సతీష్ తో కలిసి ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ దేవేందర్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ రూ.30 వేలు ఖర్చు చేసి బాటసారులకు 365 రోజుల పాటు సురక్షితమైన తాగునీటిని అందించడం సంతోషించదగిన విషయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో మరిన్ని చేపట్టాలన్నారు. అందుకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. ఈ సందర్భంగా నీటి దాత మాడిశెట్టి రమేష్ ను, నిర్వాహకులను, కోర్ కమిటీ సభ్యులను ఏసీపీ అభినందించారు. అతిథులుగా హాజరైన ఏసీపీ దేవేందర్ రెడ్డి, సీఐ సతీష్ లకు పుష్పగుచ్ఛాలు అందించి దుశ్శాలువాలతో సత్కరించారు.

# ఘనంగా సోనూసూద్ జన్మదిన వేడుకలు



వరంగల్ వాయిస్, వరంగల్ : సహృదయ వృద్ధాశ్రమంలో చిలువేరు శంకర్ ఆధ్వర్యంలో మంగళవారం మనసున్న సేవకుడు, నటుడు సోనూసూద్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి వృద్ధులకు పంచారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. కరోనా కష్టకాలంలో సోనూసూద్ చేసిన సేవలను కొనియాడారు. అనంతరం యూ బ్లడ్ ఆప్ పోస్టర్లను డాక్టర్ల బృందం ఆవిష్కరించారు. యూ బ్లడ్ ఆప్ సృష్టికర్త డాక్టర్ జగదీష్ బాబు యలమంచిలిని డాక్టర్ల బృందం, స్టాఫ్ ప్రత్యేకంగా అభినందించారు..

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com